క్లుప్తంగా

శ్రీపాదకుమారశర్మకు ఉగాది పురస్కారం



శ్రీపాదకుమారశర్మను సన్మానిస్తున్న సభ్యులు

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ నాటకప్రయోక్త, నంది అవార్డు గ్రహీత శ్రీపాదకుమార శర్మకు తెలుగు వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది పురస్కారాన్ని సోమవారం అందజేశారు. ప్రతి ఏడాది ఉగాది పురస్కారాలు అందిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీపీ చందన్‌రావు, ప్రభాకర్, చిరంజీవాచార్యులు, గుండ సంతోష్, బింగి మోహన్, కందకుర్తి ఆనంద్, ప్రకాశ్‌రావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో గోటి తలంబ్రాల దీక్ష



మల్లికార్జున ఆలయంలో భక్తులు

నిజామాబాద్ రూరల్: గజ్వేల్‌లోని శ్రీరామ కోటి భక్త సమాజం సంస్థ సోమవారం నగరంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో గోటి తలంబ్రాల దీక్ష నిర్వహించారు. భక్తులు గోటి తలంబ్రాల్లో పాల్గొని రామస్మరణ చేశారు. గోటితో ఒడ్లను ఒలిచి తలంబ్రాలు తయారు చేసి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజుకు అందజేశారు. గోటి తలంబ్రాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఈగ రమేశ్‌రెడ్డి అన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. వారి కుటుంబాన్ని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు శేఖర్ గౌడ్, మునిపల్లి సాయిరెడ్డి, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి సన్మానం



సాయిరెడ్డిని సన్మానిస్తున్న సంజీవ్‌రెడ్డి

మోపాల్: బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన మామిళ్ల సాయిరెడ్డిని ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవ్ రెడ్డి తన స్వగృహంలో సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయిరెడ్డి సౌమ్యుడని, అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ బోర్గాం గ్రామ అధ్యక్షుడు ఈగ నర్సారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు గాధరి సంజీవ్ రెడ్డి పాల్గొన్నారు.

కవులకు సన్మానం



కవులు, కళాకారులను సన్మానిస్తున్న సభ్యులు

నిజామాబాద్ రూరల్: ఇందూరు యజ్ఞ సమితి చైర్మన్ మూడ నాగభూషణం గుప్తా ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను నగరంలోని వేణు మాల్‌లో ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు, కవులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ దండునీతుకిరణ్, మధుసూదన్‌శర్మ, కవులు, కళాకారులు తదితరులుపాల్గొన్నారు.

జూన్ 8న పరిచయ వేదిక

నిజామాబాద్ రూరల్: నిజామాబాద్ పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక సంఘం ఆధ్వర్యంలో జూన్ 8న పరిచయ వేదికను నగరంలోని విజయలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు దాసరి నర్సింలు, ప్రధాన కార్యదర్శి మైసల నారాయణ సోమవారం పేర్కొన్నారు. గతంలో జిల్లా సంఘం ఆధ్వర్యంలో వధూవరుల పరిచయవేదికలు 18 సార్లు చేపట్టినట్లు తెలిపారు.

సాయినగర్‌లో సమస్యల తిష్ట

- రోడ్లు, డ్రెయినేజీ, మంచి నీటి సరఫరా లేక ఇబ్బందులు
- పట్టించుకోని కార్పొరేషన్ అధికారులు
- ఇబ్బందుల్లో కాలనీవాసులు



కాలనీలో డ్రెయినేజీలో లేని ప్రాంతం



కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు

సుభాష్‌నగర్: నిజామాబాద్ నగరం మున్సిపల్ స్థాయి నుంచి కార్పొరేషన్‌కు ఎదిగినా.. ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టవేశాయి. కార్పొరేషన్‌లో అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో 20 ఏళ్లు గడిచినా.. 7వ డివిజన్ సాయినగర్ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రతి ఏడాది పన్నుల కోసం వచ్చే అధికారులు.. సౌకర్యాల కోసం అడిగితే పట్టించుకోవడం లేదు.

20 ఏళ్ల నుంచి అవే కష్టాలు

నగరంలోని 7వ డివిజన్ సాయినగర్‌లో 20 ఏళ్ల నుంచి అనేక కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఎన్నికలు వస్తూనే ఉన్నాయి.. కౌన్సిలర్లు, కార్పొరేటర్లు మారుతూనే ఉన్నారు.. కానీ సాయినగర్‌లో మాత్రం కనీస సౌకర్యాలైన రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సరఫరాకు దిక్కులేదు. ఐదేళ్ల కాలం గడిచిపోతున్నా.. వారు ఇస్తున్న హామీలు మాత్రం నీటిమీద రాతలుగా మారుతున్నాయి. వర్షాకాలం వస్తే గుంతల్లో నీరు నిలిచి రోడ్డుపై నడవరాకుండా తయారవుతోంది. డ్రెయినేజీలు మాత్రం ఎవరి ఇంటి ఎదుట వారే నిర్మించుకుంటున్నారు. ఓపెన్ ప్లాట్‌లో మురుగునీరు నిలిచి దోమలకు ఆవాసంగా మారుతోంది. సుమారు 40కిపైగా కుటుంబాలకు మంచినీటి, అమృత్ పథకం కింద కూడా పైప్‌లైన్ వేయలేదు.

మంచినీటి పైప్‌లైన్ కనెక్షన్ ఇవ్వాలి



కాలనీలో 15 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం నేటికీ చేపట్టలేదు. మంచినీటి పైప్‌లైన్ లేక బోరు నీరు తాగాల్సి వస్తోంది. లేకపోతే మినరల్ వాటర్‌ను కొనుక్కుంటున్నాం. మంచినీటి పైప్‌లైన్ కోసం అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నాం. పట్టించుకోవడం లేదు. వెంటనే తాగునీటి పైప్‌లైన్ కనెక్షన్ ఇప్పించాలి. – పూర్వజ, సాయినగర్

డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాలి



కాలనీలో పదేళ్లుగా ఉంటున్నాం. ఇప్పటి వరకు రోడ్లు, డ్రెయినేజీలు లేవు. మురుగునీరంతా ఓపెన్ ప్లాట్లల్లోకి చేరి నిల్వ ఉంటోంది. వర్షాకాలంలో అయితే నడవడానికి కష్టంగా ఉంటుంది. ఇంటి పన్నులు కూడా ఎప్పటికప్పుడు చెల్లిస్తుంటాం. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలి. – పుష్ప, సాయినగర్

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం





పడకల్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ రావుట్లలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్, జక్రాన్‌పల్లి, పడకల్ గ్రామాల్లో అర్గుల్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అర్గుల్, జక్రాన్‌పల్లిలో సొసైటీ చైర్మన్ గంగారెడ్డి, పడకల్‌లో వైస్ చైర్మన్ అప్పల నడిపి రాజన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో సర్పంచుల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గోర్త రాజేందర్, పుప్పాల శ్రీనివాస్, ఎస్ గంగారెడ్డి, తిరుపతిరెడ్డి, మేకల రవీందర్, సాయన్న, భాస్కర్, నవీన్ రెడ్డి, సోమ్ చిన్నారెడ్డి, సాగర్, రాజేశ్వర్, పిల్లి విజయ్, అరవింద్, నందు రెడ్డి, అప్పల వినయ్, రైతులు పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: మండలంలోని రావుట్లలో సిరికొండ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ చెల్లెం గంగాధర్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గొల్ల ఎర్రన్న, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాకారం రవి, డైరెక్టర్ బాబన్న, ప్రసాద్, సామేల్, దాసు, భాస్కర్, శంకర్, బాలకిషన్, కిషన్, నందు, సీఈవో గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థలంలో జీపీ భవన నిర్మాణ పనులు

ధర్పల్లి: మండలంలోని వాడి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు చేపట్టేందుకు గ్రామ అభివృద్ధి కమిటీకి చెందిన కొంతమంది సభ్యులు సోమవారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం గ్రామంలో వివాదానికి దారి తీసింది. పాఠశాల స్థలంలో జీపీ భవన నిర్మాణాన్ని చేపట్టడాన్ని గ్రామానికి చెందిన యువజన సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. పాఠశాల ప్రాంగణాన్ని కాపాడి వేరే చోట నిర్మించాలని కోరారు. వరుస సెలవులు ఉన్న సమయంలో, అధికారులు ఎవరూ లేకుండానే హడావిడిగా జీపీ భవన నిర్మాణానికి భూమి పూజ చేపట్టడంపై పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి ఎంఈవో రమేశ్‌కుమార్‌ను వివరణ కోరగా పాఠశాల ఆవరణలో జీపీ భవన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేమని పనులు చేపట్టకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయాలి



మాట్లాడుతున్న రైతు నాయకులు

నిజామాబాద్ సిటీ: జిల్లాలో వరి కోతలను రైతులు పది రోజుల నుంచి ప్రారంభించారని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. వరి కోత సీజన్‌లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ఆలస్యం చేయడం వల్ల మార్కెట్లో దళారులు, వ్యాపారస్తులు ధాన్యానికి తక్కువ ధరకు కొనుగోలు చేస్తారని, దీంతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకు అమ్మి మోసపోయే అవకాశం ఉందన్నారు. తరుగు పేరుతో తూకంలో మోసం చేయవద్దని కోరారు. అన్ని రకాల ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు నాయక్‌వాడి నర్సయ్య, సాయిలు, గోపాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న వెంకటనర్సయ్య

నిజామాబాద్ నాగారం: నగర పద్మశాలి సంఘం అధ్యక్షుడు గుజ్జెటి వెంకటనర్సయ్య సమక్షంలో సోమవారం రోటరీనగర్ పద్మశాలి తర్ప నం 68 నూతన అధ్యక్షుడు యేముల వెంకన్న, ప్రధానకార్యదర్శి సంజీవన్, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో డి యాదగిరి, హన్మాండ్లు, గెంట్యాల వెంకటనర్సయ్య, ఏనుగందుల మురళి, దాసరి గుండయ్య, సత్యప్రకాశ్, దేవిదాస్, సత్యపాల్, పెంటిదేవిదాస్ తదతరులు పాల్గొన్నారు.

'సహకారాల్లో' మొండి బకాయిలు



నల్లవెల్లి సహకార సంఘం

- ఓటీఎస్ అవకాశం కల్పించినా ముందుకు రాని రైతులు
- నిన్నటితో ముగిసిన ఓటీఎస్ కాల పరిమితి

ఇందల్వాయి: మండలంలోని నల్లవెల్లి, ఇందల్వాయి సహకార సంఘాల్లో దీర్ఘకాలిక రుణాల రూపంలో ఉన్న మొండి బకాయిలు పేరుకుపోయాయి. నల్లవెల్లి సహకార సంఘంలో రూ. 40 లక్షలు, ఇందల్వాయిలో రూ. 60 లక్షల వరకు మొండి బకాయిలు ఉన్నాయి. ఈ మొండి బకాయిలు వసూలు చేసేందుకు వడ్డీపై 70 శాతం భారీ రాయితీతో కూడిన ఓటీఎస్(వన్ టైమ్ సెటిల్‌మెంట్)ను ప్రభుత్వం మార్చి 31 వరకు పొడిగించింది. కానీ రైతులు వాటిని సద్వినియోగం చేసుకోలేదు.

నోటీసులతోనే సరి..

బకాయిదారులకు సంఘాలు నోటీసులు జారీ చేస్తున్నా వారు స్పందించడం లేదు. కొందరు రైతులు ఉద్దేశ పూర్వకంగానే రుణాలు చెల్లించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టా పాసు పుస్తకాలతో మార్టిగేజు రుణాలు పొందిన కొందరు రైతులు ధరణిలోని లోసుగులను వాడుకొని తనఖా పెట్టిన భూమిని బదలాయిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. ఈ మోసాలపై సహకార సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

మొండి బకాయిలతో రైతులకే నష్టం

ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విక్రయం, సభ్యుల వాటాధనం, పంట, బంగారు రుణాల ద్వారా సహకార సంఘాలకు వచ్చిన ఆదాయాన్ని దీర్ఘకాలిక రుణాలుగా రైతులకు ఇస్తున్నారు. రుణం తీసుకున్న రైతులు వాటిని సకాలంలో చెల్లించకుంటే సంఘాల అభివృద్ధి వెనకబడటమే కాకుండా నిధుల లేమితో రైతులకు నాణ్యమైన సేవలు దూరమవుతాయి.

తీసుకున్న రుణాలు చెల్లించాలి

రైతులు తీసుకున్న మార్టిగేజి రుణాలు ఎప్పటికైనా చెల్లించక తప్పదు. వడ్డీపై భారీ రాయితీలు ప్రకటించి ఏకకాల చెల్లింపులకు అవకాశం కల్పించినా రైతులు సద్వినియోగం చేసుకోలేదు. నోటీసులు ఇచ్చినా లెక్కచేయని రైతులపై చర్యలు తీసుకుంటాం. బకాయిదారులు ఇకనైనా అప్పులు చెల్లించి సంఘం అభివృద్ధితో పాటు తోటి రైతులకు మెరుగైన సేవలు అందేలా సహకరించాలి.

– నోముల శ్రీనివాస్ రెడ్డి, చైర్మన్, నల్లవెల్లి సహకారం సంఘం

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008–2009 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పదహారేళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు.

కాంగ్రెస్‌ది మోసపూరిత, కక్షసాధింపు పరిపాలన



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే

వేల్పూర్: తెలంగాణాకు శ్రీరామరక్ష కేసీఆర్ అని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వేల్పూర్‌లోని ఆయన నివాసంలో బాల్కొండ బీఎస్పీ అభ్యర్థి నర్సయ్య, బాల్కొండ ఇన్‌చార్జి శ్రీనివాస్... ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు భీమ్‌గల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ బోర్ల లింగం, మోర్తాడ్ సీనియర్ నాయకుడు రంజిత్, సికింద్రాపూర్ పెద్దమ్మకాడి తండా సర్పంచ్ రమేశ్, ఇతర నాయకులు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసపూరిత, కక్షసాధింపు పరిపాలన చేస్తోందన్నారు. ఈ చేరికలు కాంగ్రెస్ పార్టీ పరిపాలనపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతకు నిదర్శనమని చెప్పారు. రైతుబంధు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. నాట్లు వేసేటప్పుడు కేసీఆర్ రైతుబంధు ఇస్తే, రేవంత్‌రెడ్డి ఓట్లు ఉన్నప్పుడు రైతుబంధు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల తరఫున ప్రశ్నించే వారిని కాంగ్రెస్ పార్టీ కేసులు పెట్టి భయపెట్టాలని చూస్తోందని వ్యాఖ్యానించారు.



బోర్గాం(పి)లో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌కు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



జక్రాన్‌పల్లిలో రంజాన్ వేడుకల్లో ముస్లింలు

ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు

సాక్షి, నెట్‌వర్క్: ముస్లింలు రంజాన్ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్, రూరల్ నియోజకవర్గాల్లోని ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులకు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నగరంలోని ఖిల్లా ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రూరల్ మండలం గుండారంలో సందేశం ఇస్తున్న ఇమామ్



మోపాల్: కంజర ఈద్గాలో..



సిరికొండ మండలం కొండాపూర్‌లో..



పెద్దవాల్గోట్‌లో..



డిచ్‌పల్లి ఈద్గాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు





నగరంలోని ఖిల్లా ఈద్గాలో చిన్నారులు, యువకులు

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపాలి



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు



యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నిజామాబాద్‌అర్బన్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడాన్ని విరమించుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు గిరిరాజ్ కళాశాల ఎదుట సోమవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను కార్పొరేట్ కంపెనీలకు అమ్ముకుంటుందని ఆరోపిస్తున్న కాంగ్రెస్ పార్టీ, రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల భూములను అమ్ముకోవడం ద్వంద్వ వైఖరిని తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ వైఖరిని విడనాడాలని హెచ్చరించారు. నాయకులు నాయకులు వరుణ్, సాయి, రాజు, నవీన్, రాకేశ్, వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయడాన్ని నిరసిస్తూ యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సోమవారం కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు గణేశ్ మాట్లాడుతూ.. భూముల వేలాన్ని ఆపివేయాలని డిమాండ్ చేశారు. నాయకులు సృజన్, వరదరాజ్, రాకేశ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	92,600	వెండి(కిలో)	1,05,500
22 క్యారెట్స్	83,470		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సుడ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	12	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	70	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	10	20	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	30	50	చామగడ్డ	50	70
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	40	60
పుదీనా	30	50	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	35	60			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-10.45, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-2	వీర ధీర శూరన్(తెలుగు)-10.50, 7.40
	రాబిన్‌హుడ్(తెలుగు)-1.40
	ఎల్-2 ఎంపురాన్(తెలుగు)-4.20, 10.30
స్క్రీన్-3	వీర ధీర శూరన్(తెలుగు)-1.30
	రాబిన్‌హుడ్(తెలుగు)-4.30, 7.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	రాబిన్‌హుడ్(తెలుగు)-10.10, 1.20, 4.30, 7.40, 10.50
స్క్రీన్-2	ఎల్-2 ఎంపురాన్(తెలుగు)-10.10
	కోర్ట్(తెలుగు)-1.45
స్క్రీన్-3	వీర ధీర శూరన్-పార్ట్-2 -10.05, 4.10, 7.30, 10.50
	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-1.25
స్క్రీన్ -4	మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-10.00
	ఎల్-2 ఎంపురాన్ -12.45, 7.25, 11.00
	కోర్ట్(తెలుగు)-4.20
లలితామహల్	కోర్ట్, దేవి రాబిన్‌హుడ్
నటరాజ్	షణ్ముఖ, విజయ్ మ్యాడ్ స్క్వేర్